రాగం :	రచన :

తాళం :	సంగీతం :

గానం :

# 139. భాషాదీపం

ప॥ కొడిగట్టిన దీపానికి చమురు చుక్క వెలుతురు

దిశలంటిన యామినిలో మింటి చుక్క వెలుతురు

వెలుగు మలిగి, ఆశ తొలిగి సాగే ఈ కాలంలో

మినుకుమనే మనికిలేని, భాషకేది వెలుతురు ॥కొడి॥

చ॥1 బీడువడిన బంజరులో తొలిచినుకొక శ్వాస

మోడువడిన తరుశాఖకు చివురుమొలక శ్వాస

శ్వాస ఊసుమరచిపోయి, పలికే శ్రుతి యంత్రంలో

ఊపిరెలా పొదుగుతావు ఉసూరంది భాష ॥కొడి॥

చ॥2 క్షరము కాని అక్షరాన తానే ఒక ప్రాణమై

ప్రతి పదమూ రవళించును పలుకుల నిక్వాణమై

సంకరమౌ భాషణమే వాగ్భూషణమై పోతే

తల్లడిల్లు తల్లిభాష తనువున అది బాణమై ॥కొడి॥

చ॥3 అచ్చమైన అచ్చులా మ్రోగుతుంది అజంతమై

స్వరభేదం కల్పిస్తే పలుకును భాస్వంతమై

మాట వెనుక గుండెతడిని కనకుంటే నేస్తమా

మౌనం ఆ మధనం ఇక మూగదౌను భాష ॥కొ॥